ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 16 | సంచిక : 07 | మార్చి 2011

**రమణ భాస్కర**

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

**చందా**

సంవత్సర చందా:రు॥150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

**రమణ భాస్కర**

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు ~ 534 265

☎ 08814 - 224747

9247104551

**ఈ సంచికలో....**

ఏలూరు .......... 06-01-2011

జిన్నూరు ......... 23-01-2011

చెరుకుమిల్లి .... 14-01-2011

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్ (దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్, పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 06-01-2011, ఏలూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

విష్ణువు యొక్క నామాలలో అచ్యుత, అనంత, గోవింద ఈ మూడు నామాలు ముఖ్యమైనవి. ఈ నామాల్ని మనం స్మరించుకోవటం వలన మన బుద్ధి శుద్ధమవుతుంది. తిరుమల కొండమీద ఒక రాయే కాదు, వృక్షమేకాదు, ఆకేకాదు తిరుమల కొండ అంతా మహావిష్ణువు యొక్క స్వరూపమే. వేంకటేశ్వరస్వామిని అందరూ మహావిష్ణువు అని అంటారు. మహావిష్ణువు మాత్రమేకాదు సర్వదేవతాస్వరూపుడు. ద్వాపర యుగంలో ఎవడైతే గోవిందుడో ఆ గోవిందుడే కలియుగంలో వేంకటేశ్వరస్వామి రూపంలో కొండమీద వెలిసాడు. అందుచేత భక్తులు అందరూ కొండమీదకు వెళ్ళినప్పుడు వేంకటేశ్వరా, వేంకటేశ్వరా అని స్మరించరు గోవిందా, గోవిందా అని పిలుస్తారు. గోవిందుడే వేంకటేశ్వర స్వామి రూపంలో ఉన్నాడని ప్రసిద్ధి. కలియుగానికి వేంకటేశ్వరస్వామి అధిష్ఠానదైవం. కలియుగదైవమైనటువంటి వేంకటేశ్వరస్వామిని స్మరించుకోవటం వలన ఆయన రూపాన్ని ధ్యానించుకోవటం వలన మన బుద్ధిలో ఉన్న దోషాలు హరిస్తాయి, మన బుద్ధి పవిత్రం అవుతుంది.

భగవద్గీత అంటే భగవంతుడు చెప్పినమాట, మనకి భగవంతుడి మీద ప్రేమ ఉంటే భగవంతుడిమీద భక్తి ఉంటే, భగవంతుడి మీద ఇష్టం ఉంటే, ఆయన చెప్పిన మాట మీద భక్తి, ప్రేమ, ఇష్టం కలుగుతుంది. భగవంతుడు మీద మనకి ఇష్టం లేనప్పుడు ఆయన చెప్పిన మాట మీద గౌరవం కలగదు. సాక్షాత్తు బ్రహ్మమే నామరూపాలు ధరించి భగవద్గీత బోధించింది కాబట్టి దీనిని భగవాన్ ఉవాచ అన్నారు.

**కామ ఏష క్రోధఏష రజోగుణ సముద్భవః**

**మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ (3-37)**

కామక్రోధాలు అన్నా, రాగద్వేషాలు అన్నా ఒక్కటే. జీవుడిని పీడించేవి ఈ కామక్రోధాలే. గజేంద్రుడిని మొసలి పట్టుకున్నట్టు ఈ కామక్రోధాలు జీవుడిని పట్టుకుని జీవుడు మోక్షం పొందకుండా, పరమాత్మ జ్ఞానం పొందకుండా ఆ జీవుడిని దేహానికి బంధిస్తున్నాయి. ఏది అయితే బ్రహ్మమో అదే మనం అయినప్పటికి దాని తాలుక అనుభవంకాని, దాని తాలుక సుఖంకాని, దాని తాలుక శాంతికాని మనకి అనుభవంలోనికి రాకుండా చేసేవి ఈ కామక్రోధాలే. రజోగుణం ఎక్కడ అయితే ఎక్కువ ఉందో అక్కడ కామక్రోధాలు ఉంటాయి. సత్వగుణం ఉన్నవాడు నిదానంగా ఆలోచిస్తాడు. వాడికి కామక్రోధాలలోంచి విడుదల పొందుదాము అనే వివేకం కలుగుతుంది. పాములు పుట్టలో ఎలాగ ఉంటాయో అలాగ కామక్రోధాలు మనస్సులో ఉంటాయి. మన ఇంద్రియాలు వెళ్ళి మనస్సును ఆకర్షిస్తాయి. ఇంద్రియాలు మూలంగా మన మనస్సు తొందరగా బహిర్ముఖమవుతుంది. మనస్సు బహిర్ముఖం అవ్వటం తేలిక. మన మనస్సుని అంతర్ముఖం చేయటం కష్టం. దైవానుగ్రహం లేకుండా మన మనస్సు అంతర్ముఖం అవ్వదు, నువ్వు ఏది అయినా పని మొదలుపెట్టినప్పడు ఆ పని పూర్తి అవ్వాలి అని చేసుకుంటావు అది మంచిదే. నీకు ఆ పని పూర్తి అవ్వటం ఎంత ముఖ్యమో, నువ్వు పని చేసేటప్పడు ఆ పని ఎలా చేస్తున్నాము, సక్రమంగా చేస్తున్నామా అనేది కూడా అంతే ముఖ్యం. మీరు బజారులో ఏదయినా వస్తువు కొనుక్కున్నప్పడు ఆ వస్తువు మన్నిక ఎలా ఉంటుందో చూచుకుంటారు కదా అలాగే మీరు పని చేసేవిధానంలో విలువలు ఉన్నాయా లేక విలువలు విడిచిపెట్టేసి ఆ పని పొందటం కోసమే చేస్తున్నారా అది చూసుకోవాలి. అక్కడ పని సాధించటం ముఖ్యం కాదు దానికి తగిన విలువలు సరిగ్గా ఉన్నాయో లేదో ఆలోచించుకో, దానిని అవలంబించే విధానం కూడా సక్రమంగా ఉంటే నీ బుద్ధికి ఏకాగ్రత వస్తుంది, నీ బుద్ధి బాగుపడుతుంది, నీ మనస్సు బాగుపడుతుంది, నీ మనస్సు బాగుపడితే నువ్వు శ్రేయస్సు పొందుతావు. నీ మనస్సు పాడయిపోతే చివరికి నువ్వు పతనం అయిపోతావు. నువ్వు బాగుపడినా నీ మనస్సే కారణం, నువ్వు పాడయిపోయినా నీ మనస్సే కారణం. మనం మన మనస్సును బాగుచేసుకోవటానికి ఏమీ ప్రయత్నం చేయటంలేదు. దేహానికి మరణం వచ్చేస్తోంది. మనం టైము పాడు చేసుకుంటున్నాము. డబ్బుపోతే తిరిగి సంపాదించుకోవచ్చు కాని కాలాన్ని దుర్వినియోగం చేసుకుంటే ఆ కాలం తిరిగిరాదు.

కామం అంటే కోరిక. కామం అనేది మహాశని. కోరిక నువ్వు అనుభవించే కొలది పెరిగిపోతుంది కాని అది ఇంక తగ్గదు. ఆ గొయ్యిని ఎవడూ పూడ్చలేడు. వెయ్యికోట్ల డబ్బు సంపాదించి మీ పిల్లలకి ఇవ్వండి. వాళ్ళు సంతృప్తి పడరు. మీరు వెయ్యికోట్లు డబ్బు సంపాదించి ఇస్తే వాడికి మంచిగుణం లేకపోతే మీరు ఇచ్చిన వెయ్యికోట్లు తినేస్తాడు కాని మీరు చనిపోతే మీ శవం కూడా స్మశానం వరకు కూడా రాడు. అది మానవుడి యొక్క స్వభావం. ఇస్తే తినేస్తాడు కాని వాడికి కృతజ్ఞత ఉంటుందని మీరు అనుకోవద్దు. వచ్చిన కోరికల్లా నెరవేర్చుకుంటూ కోరికలని జయించినవాడు ఈ సృష్టిలో ఎవడూ లేడు. నిప్పులో కిరసనాయిలు వేస్తే మంట ఎలా పెరిగిపోతుందో అలాగ నువ్వు కోరికలు నెరవేర్చుకొనే కొలదీ ఆ కోరికలు పెరిగిపోతాయి. ఒక కోరిక నెరవేరితే, నెరవేరిన కోరిక ఇంకో పది కోరికలని తీసుకువస్తుంది. అందుచేత కోరికలకి అంతులేదు. పరమాత్మ కోరికకి మహాశని అని పేరు పెట్టాడు. నువ్వు కామక్రోధాలని సంతృప్తిపరచుకుంటూ వెడితే దానికి ముగింపు లేదు. చివరికి నువ్వు శవాలని మోస్తూ ఉండాలి. అలాగని నీ పొట్టకోసం, నీ బట్టకోసం ఇతరుల మీద ఆధారపడకు. నీ శరీరయాత్రకి అవసరమైనంతవరకు నువ్వే సంపాదించుకో అంతేగాని వేలాదికోట్లు సంపాదించేసి, వేలాది కోట్లు పోగుపెట్టేద్దాము అని ఆ గొడవలలోకి నువ్వు వెళ్ళకు. ఆ గొడవలోకి వెడితే పైకి అందరూ నిన్ను పొగుడుతూ ఉంటారు. నువ్వు మూలంలో నాశనం అయిపోతావు. అదే మహాశని.

నువ్వు కామక్రోధాల యొక్క వేగం తగ్గించుకోవటానికి సాధన చేసుకో. నీకు సినిమాకి వెళ్ళాలనే కోరిక వచ్చింది అనుకో, నీ వివేకంతోటి, నీ బుద్ధి సూక్ష్మతతోటి సినిమాకి వెళ్ళాలనే కోరిక తొలగించుకున్నావు అనుకో, ఆ మరుసటి రోజున నీకు సినిమాకి వెళ్ళి వచ్చిన దానికంటే వెళ్ళకపోవటం వలన ఎక్కువ శాంతి కలుగుతుంది. నీకు ఏది అయినా కోరిక వస్తే ఆ కోరికని సంతృప్తి పరచుకోవటం కంటే ఆ కోరికని నిగ్రహించుకోవటం వల్ల నీకు ఎక్కువ సంతోషం వస్తుంది, ఎక్కువ శాంతి, ఆనందం వస్తుంది. నువ్వు కోరికల తోటి పోరాడి కోరికల్ని జయించలేవు. మనకి భగవంతుడిని తెలుసుకోవాలనే జిజ్ఞాస పెరిగితే, అజ్ఞానంలోనుండి, అవిద్యలోనుండి, బంధంలోనుండి విడుదల పొందాలి అనే తపన మనలో పెరిగితే మనకు తెలియకుండా చిల్లరకోరికలు అన్నీ తగ్గిపోతాయి. భగవంతుడిని తెలుసుకోవాలనే పెద్ద కోరిక మనకు వచ్చే చిన్న కోరికలను అన్నిటిని తగ్గించేస్తుంది. మీరు సినిమాకి వెడదామని అనుకుంటున్నారు. డాక్టరుగారు మీ గుండె తేడాగా ఉంది సినిమాకి వెడితే చనిపోతారు ముందు హాస్పటల్‌కి వెళ్ళండి అంటే అప్పుడు ఆ సినిమా దృష్టి వెంటనే

మరచిపోతారు. మీ గుండె జబ్బు తగ్గించుకోవటానికి హాస్పటల్‌కి వెళ్లిపోతారు. అంటే సినిమాకి వెళ్ళాలనే కోరికని హాస్పటల్‌కి వెళ్ళాలనే కోరిక తరిమివేసింది కదా! అలాగే మీరు భగవంతుడిని పొందాలి, మోక్షం పొందాలి అనే కోరిక పెట్టుకుంటే చిల్లరకోరికలు వాటంతటవే పోతాయి. వాటితో మీరు పేచీ పెట్టుకోనక్కరలేదు.

మనకి ఆత్మవిద్య ఎప్పుడు కలుగుతుంది అంటే మనకి బాహ్యవిషయాలమీద ఎంత ఇష్టం ఉందో అంత ఇష్టం అంతర్యామి అయినటువంటి నారాయణుడిమీద కలిగితే, అంత ప్రేమ మనకు కలిగితే మన మనస్సుకి లోచూపు కలుగుతుంది. భగవంతుడి పట్ల మనకి చలించని విశ్వాసం ఉంటే గాలిలేనిచోట దీపం ఎలా ఉంటుందో అంత నిదానంగా మనకి విశ్వాసం ఉంటే దానికి ప్రతిఫలంగా ఆత్మజ్ఞానాన్ని అంటే నిజమైన ఆత్మవిద్యను మనకి ప్రసాదిస్తాడు. అప్పుడు మనకి ఫ్రీడం తెలుస్తుంది. అప్పటి వరకు సుఖం ఏమిటో, శాంతి ఏమిటో మనకి తెలియదు. అది అద్వితీయం. భగవంతుడు ఏమని చెబుతున్నాడు అంటే మీ దేహము చనిపోయే టైముకి అయినా నన్ను పొందటానికి ప్రయత్నం చేయండి అని పరమాత్మ చెబుతున్నాడు.

నిన్ను నువ్వు కాదనుకోకుండా, నన్ను పొందగలవా అంటాడు ఏసు. నువ్వు కాని దేహంతోటి, కాని మనస్సుతోటి తాదాత్మ్యం పొంది అది నేను అనుకుంటున్నావు కదా! ఈ ఆస్తి నాది, ఈ డబ్బు నాది, ఈ గౌరవం నాది, ఈ పలుకుబడి నాది అనుకుంటున్నావు. ఈ దేహము నేను అనుకోవటం ఎంత నిజమో అవి కూడా అంతే నిజం. పైగా ఇవన్నీ చుట్టబెట్టుకొని నీలో ఏదో ప్రత్యేకత ఉంది అనుకుంటున్నావు. ఇవన్నీ పేకముక్కల కోటలు. విచారణ చెయ్యనంతసేపూ నిజంకింద కనిపిస్తాయి. విచారణ చేస్తే నువ్వు ఏదైతే కాదో దానితోటి సంబంధాలు అన్నీ తెగిపోతాయి. పేకముక్కలకోటలు పడగొట్టడానికి గెడ్డపారలు అక్కరలేదు. గట్టిగా గాలివేస్తే పడిపోతాయి. మనకి ఇంతమంది చుట్టాలు ఉన్నారు, బ్యాంకులో ఇన్ని డబ్బులు ఉన్నాయి, ఇన్ని పొలాలు ఉన్నాయి అని నేను వీటిచుట్టూ తిరుగుతూ ఉంటుంది. ఇవన్నీ నేనుకి కాపలా అన్నమాట. నువ్వు ఈ నేనుని విడిచిపెట్టకుండా నన్ను పొందగలవా అంటే జీవలక్షణాలు పోకుండా నువ్వు ఆత్మని పొందలేవు. నీకు రెండూ కావాలంటే సాధ్యం కాదు. నీకు స్వరూపజ్ఞానం కావాలంటే అజ్ఞానం విడిచిపెట్టాలి, అవిద్యని విడిచిపెట్టాలి అన్నాడు ఏసు.

ఉన్న వస్తువు ఒక్కటే అదే బ్రహ్మము. బ్రహ్మమే నీకు దేవుడుగా కనిపిస్తున్నాడు వాడే

నీకు జీవుడుగా కనిపిస్తున్నాడు, వాడే నీకు ప్రపంచంగా కనిపిస్తున్నాడు. కనిపించేదంతా నిజంకాదు. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు ఇవన్నీ అజ్ఞానం యొక్క కల్పితములు అని రమణ మహర్షిగారు చెబుతారు. భగవాన్‌తో ఒకరు ఏమన్నారు అంటే ఈ ప్రపంచం ఇంత స్పష్టంగా కనిపిస్తోంది, ఈ జీవకోటి అంతా స్పష్టంగా కనిపిస్తోంది, ఇంత స్పష్టంగా కనిపించే దానిని లేదు అంటే ఎవరు అంగీకరిస్తారు అన్నారు. అప్పుడు భగవాన్ ఏమన్నారు అంటే ఏదైతే నిజమో అది నీకు అబద్ధంగా కనిపిస్తోంది, ఏదైతే అబద్దమో అది నిజంగా కనిపిస్తోంది దీనికి కారణం మాయ అన్నారు. ఆ మాయ ఎక్కడ ఉంది అంటే మీ మనస్సులో ఉంది, మీ ఇంద్రియాలలో ఉంది, మీ బుద్ధిలో ఉంది, ముందు మీలో ఉన్న మాయని కక్కిస్తే, ఆ ముడి తెగిపోతే అప్పుడు నీకు ఉన్న వస్తువు ఉన్నట్టుగా కనిపిస్తుంది, లేనిది లేనట్టుగా నీకు తెలుస్తుంది. అప్పటివరకు ఉన్న నారాయణ స్వరూపం లేదు అనుకుంటావు లేని ప్రపంచాన్ని, లేని సంసారాన్ని ఉంది అనుకుంటావు అన్నారు. ఈ ప్రపంచం నీకు ఎంత నిజంగా కనిపిస్తోందో అంత అబద్ధం అని మీరు చెప్పింది మేము నమ్మలేకపోతున్నాము అన్నాడు. మాయ నమ్మనివ్వదు అన్నారు భగవాన్. గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే నాయందు పరిపూర్ణమైన విశ్వాసం ఉన్నవాడికి, సజీవమైన నమ్మకం ఉన్నవాడికి మాయ దారి ఇస్తుంది కాని, నా మీద నమ్మకం లేనివాడికి వాడు ఎంత సాధన చేసినా, నా దయ లేకుండా వాడి తెలివితేటలు వల్ల మాత్రమే నా మాయని అతిక్రమించలేడు అని పరమాత్మ చెప్పాడు.

మహాశనో, మహాపాప్మా, మీరు అందరూ బుద్ధిమంతులే కాని మీరు పాపాలు చెయ్యటం మానరు. కారణం ఏమిటి అంటే ఈ కామం, క్రోధం మీచేత పాపాలు చేయిస్తాయి. మీకు కోపం వచ్చినప్పుడు, కోరిక వచ్చినప్పుడు బుద్ధిగా ఉండలేరు, శుచిగా ఉండలేరు మీరు పాపాలు చేసి తీరతారు. ఇంత డీటైల్డ్‌గా చెప్పినా మనకి బుద్ధిరావటంలేదు, ఎందుకు బుద్ధి రావటంలేదు అంటే మనకి పుణ్యబలం లేదు. మనకి ఒక మంచి తలంపులేదు, మంచి ఆలోచన లేదు, మంచి చేతలేదు ఇంక మాయ మనకు ఎందుకు దారి ఇస్తుంది, మాయ దారి ఇవ్వదు. ఓ అరుణాచలేశ్వరుడా నా శరీరం స్మశానంలో కాలి బూడిద అవ్వకముందే నీ జ్ఞానాగ్నిని పంపించి నా అజ్ఞానాన్ని, నా కామక్రోధాలని దహించు అరుణాచలేశ్వరుడా. పుల్లల వల్ల పిడకల వల్ల శరీరం కాలుతుంది కాని మనస్సులో ఉన్న గుణాలు కాలవు, అజ్ఞానం కాలదు, జనన మరణ ప్రవాహంలో కొట్టుకుపోయే నన్ను రక్షించడానికి ముందు నాలో ఉన్న అజ్ఞానాన్ని దహింపచెయ్యి అరుణాచలేశ్వరుడా అన్నారు భగవాన్. మీరు అందరూ దుఃఖ స్పర్శలేని స్థితిని పొందాలి. మనకి ప్రారబ్ధం అనుకూలంగా ఉన్నా ప్రతికూలంగా ఉన్నా

మన శాంతిని మనం పోగొట్టుకోకూడదు. మనకి ఒకవేళ కష్టాలు వచ్చినా భగవంతుడు పట్ల సజీవమైన విశ్వాసం జారిపోకుండా చూసుకోవాలి. మనం ఎప్పడూ విశ్వాసహీనులు అవ్వకూడదు.

మా అత్తగారు శత్రువు, మా మేనత్త శత్రువు, వాళ్ళు శత్రువులు, వీళ్ళు శత్రువులు అని నువ్వు అనుకుంటున్నావు ఇక్కడ భగవంతుడు ఏమంటున్నాడు అంటే నీకు శత్రువు అంటూ ఉంటే ఒకడే శత్రువు నీలో ఉన్న కామమే నీకు శత్రువు. జీవితం పొడుగునా నిన్ను పీడించేది ఆ కామమే. నీకు ఏదైనా పోరాటపటిమ ఉంటే నువ్వు పోరాడవలసింది ఒక్క కామంతోటే. ఒకోసారి మనలో కామం అణిగి వుంటుంది. అప్పడు మనకి కామాన్ని జయించేశాం అనిపిస్తుంది. మనం భగవంతుడిని పూజించి, జపించి, మంచి వాళ్ళతోటి స్నేహాలు చేసి కోరికను అణుచుకుంటున్నాము కాని కోరిక చచ్చిపోలేదు. మన మీద ఎప్పడో మళ్ళీ తిరగబడుతుంది. అందుచేత కోరికను మీరు జయించాము అని అనుకోకండి. మీకు ఇప్పడు దుఃఖం లేదు అని దుఃఖం లేని స్థితికి వచ్చేశాం అనుకోకండి. మీ దుఃఖం అణిగివుంది. అది అణిగివున్నప్పడు మీకు దుఃఖం లేదు అని అనిపిస్తూ ఉంటుంది. ఆ దుఃఖం బుద్ధిలో దాక్కోవచ్చు, మనస్సులో దాక్కోవచ్చు, ఇంద్రియాలలో దాక్కోవచ్చు. తెలివితక్కువ వాళ్ళు ఇంద్రియాలలో దొరికేస్తారు. తెలివైనవాళ్ళు ఇంద్రియాలలో దొరకరు, బుద్ధిలో దొరుకుతారు. బుద్ధిలో ఉన్న కామం తొందరగా కనబడదు. మనం వాళ్ళకి కామం లేదు అనుకుంటాము. అక్కడ కూడా కామం ఉంటుంది. ఏ వస్తువు అయితే స్వతంత్రముగా తనంతటతానుగా ఉందో అట్టి చైతన్యములో మాత్రము కామము లేదు, అక్కడ క్రోధములేదు, అక్కడ అజ్ఞానము లేదు. నువ్వు అక్కడికి మేలుకో. అప్పటివరకూ నువ్వు కామాన్ని జయించలేవు.

**మత్కర్మ కృన్మత్పరమో మద్భక్తస్సంగవర్జితః**

**నిర్వైర స్సర్వ భూతేషు యస్సమామేతి పాణ్డవ! (11-55)**

మత్కర్మ : నాకు ఇష్టమైన పని చేయి, నేను వద్దు అన్న పని చేయకు. నేను చెప్పింది వింటే శ్రేయస్సు కలుగుతుంది. నేను చెప్పింది వినకపోతే అంధకారంలో పడిపోతావు. మత్‌పరమః : నీ గమ్యంగా నన్నే పెట్టుకో. నువ్వు పొందవలసినవాడిని నేనే అంటున్నాడు పరమాత్మ. కాని మనం భగవంతుడిని గమ్యంగా పెట్టుకోము. మనం కోరికల్ని గమ్యంగా పెట్టుకొని, ఆ కోరిక నెరవేరటానికి భగవంతుడిని బల్లకట్టుకింద ఉపయోగించుకుంటున్నాము. ఎందుచేతనంటే మనకి కోరిక నెరవేరటం గమ్యంకాని, మనకి భగవంతుడు గమ్యంకాదు.

ఇక్కడ పరమాత్మ ఏమంటున్నాడు అంటే నీ కోరిక నెరవేరవచ్చు, నెరవేరకపోవచ్చు కాని గమ్యంగా నన్ను పెట్టుకో. నన్ను పొందటానికి సాధన చెయ్యి. నువ్వు నన్ను పొందలేకపోతే ఈ జన్మలో కనీసం ఆ పొందే ప్రయత్నంలో అయినా చనిపో. నీ ప్రయత్నం సిన్సియర్‌గా ఉండాలి, డెడికేషన్‌గా ఉండాలి. తరువాత కాలం కలసిరావాలి, నీకు నా అనుగ్రహం ఉండాలి. ఇన్ని రకాలుగా కలిస్తేనే నీకు మోక్షం సాధ్యం అవుతుంది.

మీరు నా పట్ల భక్తి కలిగి ఉండండి. అంటే దానికి వ్యభిచారభక్తి పనికిరాదు. కొంతమంది శనివారం ఒకరకంగా ఉంటారు, ఆదివారం ఒక రకంగా ఉంటారు. వాళ్ళమాట నిలకడగా ఉండదు, మనసు కుదురుగా ఉండదు. ఈ నిలకడలేని భక్తిని వ్యభిచారభక్తి అంటారు. బాగా స్థిరత్వం ఉన్న భక్తి అవ్యభిచారభక్తి. కొంతమంది భక్తికి అసలు చలనం ఉండదు. వాళ్ళకి ఏదయినా నష్టం వచ్చినా, కష్టం వచ్చినా, శరీరానికి బాధలు వచ్చినా పరమేశ్వరుడు పట్ల ఉన్న విశ్వాసం చలించదు. ఇటువంటి భక్తులు అంటే నాకు ఇష్టం అన్నాడు పరమాత్మ. మీరు ఇంటి దగ్గర మీ డ్యూటీ మీరు చెయ్యండి. కానీ హృదయంలో మటుకు భగవంతుడికి స్థానం ఇవ్వండి. మనం పొందవలసింది నారాయణుడు. మన ఇంట్లో వాళ్ళకి, మనకి వున్న సంబంధాలు స్వప్న సంబంధాలు. ఈ దేహం ఎంత నిజమో ఈ సంబంధాలు కూడా అంతే నిజం అనుకుని, మనకి నిజమైన బంధువు భగవంతుడే అని తెలుసుకుని మీ హృదయంలో ఉన్న భగవంతుడికి మీరు దూరం కావద్దు. ఇంట్లో వాళ్ళకి చేతులతోటి పనులు చేసినా మనస్సులో మటుకు భగవంతుడిని విడిచిపెట్టకండి. మానసికంగా మీరు భగవంతుడికి దూరం కావద్దు.

నిర్వైరః సర్వభూతేషు : ఎవరయినా నీకు అపకారం చేసినా, మిమ్మల్ని పొరపాటుగా మాట్లాడినా మీరు వాళ్ళమీద కోపాలు, ద్వేషాలు పెట్టుకోవద్దు. వాళ్ళతోటి స్నేహం చెయ్యటం ఇష్టంలేకపోతే మానేయండి. ఎందుచేతనంటే మీరు విరోధాలు పెట్టుకుంటే మీకు భగవంతుడు జ్ఞాపకం రాడు. మనం ఎవరిమీద అయితే విరోధం పెట్టుకున్నామో మన మనస్సు వాళ్ళని తలపెడుతుంది అందుచేత నన్ను పొందటం కోసం అయినా మీరు విరోధాలు వదులుకోండి నీ ప్రవర్తన అహంకారపూరితంగా కాకుండా, భక్తిపూరితంగా ఉంటే, దేహం కేంద్రం కాకుండా, మనస్సు కేంద్రం కాకుండా, దైవాన్ని కేంద్రంగా పెట్టుకొని నువ్వు జీవిస్తూ ఉంటే, నువ్వు అహంకారాన్ని పెంచుకోవటానికి కాకుండా, దైవానుగ్రహం సంపాదించటానికి పనిచేస్తూ ఉంటే ఇంక నేను ఎక్కడికి పోతాను అర్జునా. నేను నీకు దొరికేస్తాను. నేను

నీకు లభ్యమవుతాను అన్నాడు పరమాత్మ.

నువ్వు భగవంతుడు మాటలు శ్రద్ధగా శ్రవణం చేసి, ఎలా జీవిస్తే మనకి ఆయన మోక్షం ప్రసాదిస్తాడో ఆ రకంగా జీవించటం నేర్చుకుని, మీ ఇంటి దగ్గర వృద్ధులు వుంటే వారిమీద చిరాకుపడకుండా భగవంతుడు మనకి ఇచ్చిన డ్యూటీ అని, ఆ రూపంలో వున్నవాడు కూడా నారాయణుడే అని నారాయణ స్మరణ చేసుకుంటూ వారికి సేవ చెయ్యండి. ఆ రకంగా మీ జీవితాన్ని బాగుచేసుకోండి. మీలో ఏమయినా లోపాలు ఉంటే వున్నాయని బాధపడకండి అవి పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేయండి. మీ పనులు మీరు చేసుకుంటూ భగవంతుడిని గమ్యంగా పెట్టుకొని మీరు జీవించటం నేర్చుకుంటే కొన్ని అలవాట్లు వాటంతటవే కాల ప్రవాహంలో పోతాయి. అందుచేత మీరు నామస్మరణ చేయండి. నామస్మరణ చేయటం వలన మీరు పవిత్రులవుతారు. పరమపవిత్రుడికి మాత్రమే భగవంతుడు తెలియబడతాడు. పవిత్రత, ఏకాగ్రత రెండూ మీ రెండు కళ్ళతోటి సమానం అనుకొని ఆ రెండూ సాధించడానికి నువ్వు ప్రయత్నం చేస్తూ తరించు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-01-2011, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవద్గీతలో జ్ఞానయోగం, కర్మయోగం,భక్తియోగం,ధ్యానయోగం అన్ని యోగాలకు సమానమైన ప్రాముఖ్యత ఇచ్చాడు. భగవద్గీత అంటే అది మోక్షద్వారం అంటే మోక్షంలో ప్రవేశించటానికి తగిన సూచనలు అన్నీ భగవద్గీతలో భగవంతుడు జీవకోటికి బోధించాడు. అందులో అరిషడ్వర్గాల గురించి భగవంతుడు ఎక్కువగా చెప్పాడు. అరిషడ్వర్గాలు అంటే నీలోపల ఉన్న ఆరు శత్రువులు, అవి ఎవరు అంటే కామ, క్రోధ, లోభ, మోహ,మద,మాత్సర్యములు. ఇవి నీలోపల ఉన్న శత్రువులు, ఇవి బయట ఉండవు. బ్రహ్మజ్ఞానం పొందిన వారిలో తప్పించి అంటే రామకృష్ణుడు, రమణుడు, వశిష్ఠుడు ఇటువంటి మహాత్ములలో తప్పించి ప్రతీ మనిషిలోను ఈ శత్రువులు ఉంటాయి. వాడు ధనవంతుడా పేదవాడా, వాడికి అధికారం ఉందా, లేదా వారు స్త్రీలా పురుషులా అని ఇటువంటి సంబంధం ఏమీలేదు. సాధకులలో కూడా ఇవి ఉంటాయి. సిద్ధిపొందేవరకూ వీటి గొడవ తప్పదు. వాల్మీకి రామాయణంలో ఏమని చెప్పాడంటే ఈ సృష్టిలో ఉన్న ప్రతీ జీవరాశిని కాలం కుమ్మేసి విడిచిపెడుతుంది అని చెప్పాడు. ఎవరి పరిస్థితులు ఎలా ఉంటాయో మనం చెప్పలేము. ఒక ఏరియాకు రాజుగా ఉన్న ఆయన చివరిరోజులలో ఆయన దగ్గర పనిచేసిన గుమాస్తా అన్నం పెడితే తిని

కాలక్షేపం చేయవలసివచ్చింది. ప్రారబ్దాలు చాలా విచిత్రంగా ఉంటాయి. కొంతమంది ఏమీ లేకపోయినా రోజులు బాగా వెళ్ళిపోతాయి. కొంతమంది ఇంటినిండా బంగారం, డబ్బు, ఆస్తులు ఉన్నా పొట్ట మాడిపోతూ ఉంటుంది. ప్రపంచంలో ఎన్నిరకాల జీవరాశులు ఉన్నాయో అన్ని రకాల ప్రారబ్దాలు ఉన్నాయి. రకరకాల జీవరాశులు, రకరకాల ప్రారబ్దాలతో ఈ సృష్టి నిండిఉంది. వీరందరిని కాలం కుమ్మేసి విడిచిపెడుతుంది అని వాల్మీకి చెప్పాడు.

రమణమహర్షిగారు ఏమన్నారంటే నువ్వు నేను, నేను అని అంటున్నావు కదా. ఆ నేనును అంటి పెట్టుకొని ఈ శత్రువులు అన్నీ ఉన్నాయి. ఆ నేను పోతే ఇవి అన్నీ పోతాయి. ఆ నేను పోకపోతే ఇవి కూడా పోవు, ఇవి నీ కూడానే ఉంటాయి అని చెప్పారు. నాకు బ్రహ్మలోకం వెళ్ళాలని ఉంది అని ఒకరు రమణమహర్షిగారిని అడిగారు. బ్రహ్మలోకానికి వెళ్ళాలని ఎవరు అంటున్నారు. నీ శరీరం అనటంలేదు, నీలో ఉన్న నేను అంటోంది. బ్రహ్మలోకానికి వెళ్ళాలని ఏ నేను అయితే అంటోందో ఆ నేనును తొలగించుకోగలిగితే ఇప్పుడే బ్రహ్మంలో ఉంటావు కదా అని చెప్పారు. బ్రహ్మలోకం, స్వర్గలోకం ఆ తిరుగుడు అంతా నీకు ఎందుకు, ఆ చాకిరీలు నీకు ఎందుకు. ఒకవేళ వెళ్ళినా మరల నిన్ను భూమి మీదకు గెంటేస్తారు. అందుచేత బ్రహ్మలోకానికి వెళ్ళటానికి అనుకూలమైన పనులు ఇక్కడ చేసే బదులు, ఏ నేను అయితే బ్రహ్మలోకానికి వెళతానంటోందో ఆ నేనును తొలగించుకోవటానికి ఇక్కడ ప్రయత్నం చెయ్యి. ఆ నేను పోతే ఇంక నీకు ప్రయాణాల గొడవలేదు. ఇప్పుడే ఇక్కడే నువ్వు బ్రహ్మంలో ఉంటావు. బ్రహ్మంలో ఉన్నప్పుడు ఇంక నీకు బ్రహ్మలోకం ఎందుకు. బ్రహ్మలోకం అబద్దం, బ్రహ్మం నిజం.

సాధన ఎంతకాలం చెయ్యాలి అని ఒకరు కంచి పరమాచార్యులవారిని అడిగారు. మనకు ఆస్తులు లేకపోయినా, పదవులు లేకపోయినా నేను ఒకటి ఉంది కదా. మనం ఎక్కడికి వెళ్ళినా చుట్టాల ఇంటికి వెళ్ళినా, యాత్రలకు వెళ్ళినా ఈ నేను వేసుకుని తిరుగుతూ ఉంటాము. మనం వట్టి చేతులతో వెళ్ళినా ఈ నేను మాత్రం మన కూడానే వచ్చేస్తోంది. శరీరం చనిపోయిన తరువాత కూడా ఈ నేను మనకూడా వచ్చేస్తుంది. మనం సంపాదించిన ఆస్తులు, డబ్బు ఇంటి దగ్గరే ఆగిపోతాయి. ఈ శరీరం స్మశానంతో ఆగిపోతుంది. ఈ నేను మాత్రం మన కూడా వచ్చేస్తుంది, దానిని మనం ఆపుచేయలేము. అంతేకాదు స్వర్గలోకం కావాలి, బ్రహ్మలోకం కావాలి, అని ఏదో ఒకటి కోరుకొంటూ ఉంటుంది. సాధన ఎంతకాలం చెయ్యాలి అని అడుగుతున్నావు. రెండు జన్మలు, మూడు జన్మలు అని నేను చెప్పను, రోజూ మూడు గంటలు చెయ్యి, నాలుగు గంటలు చెయ్యి అని నేను చెప్పను.

నువ్వు ఏదైతే నేను, నేను అంటున్నావో అది కనిపించకుండా పోయేవరకు సాధన చెయ్యాలి. ఆ నేను కనబడటంలేదు అనుకోండి, ఏమిటి కనబడటంలేదు అని మనం కంగారుపడతాము ఎందుచేతనంటే మనం బతికేదే ఆ నేను కోసంకదా. ఆ నేను కనబడటం లేదు అనుకోండి కంగారుపడకుండా దానికోసం వెతకాలి. అలా వెతికినా అది కనబడకూడదు. ఒకవేళ మరల అది కనబడితే పునర్జన్మ వచ్చేస్తుంది. వెదికినప్పుడు అది కనబడితే మరల సాధన చెయ్యాలి అని చెప్పారు.

నీ శరీరం శవం అవ్వకముందే, శరీరం ఈ భూమిమీద అటు ఇటు తిరుగుతున్నప్పుడు కామక్రోధాలు నిశ్శేషంగా నాశనం చేయగలిగితే, ఈ శరీరం చనిపోయేవరకు నువ్వు ఆగనక్కరలేదు. మహర్షులు, మహాత్ములు, యోగులు ఏ స్థితిని అయితే పొందారో ఆ స్థితిని ఇప్పడే ఇక్కడే నువ్వు పొందవచ్చు. అప్పడు ఎటుచూసినా సుఖమే, ఎటుచూసినా బ్రహ్మమే. చావు ఇంక నిన్ను ముట్టుకోదు, నువ్వు అమృతస్థితిని పొందుతావు అని పరమాత్మ చెప్పాడు. కామక్రోధాల నుండి ఎలా బయటకు రావాలి అని కృష్ణుడు, వశిష్ఠుడు, బుద్ధుడు, రమణమహర్షిగారు ఇంకా చాలా మంది చెప్పారు. అందరికంటే జ్ఞానేశ్వర్ చెప్పింది నాకు బాగా నచ్చింది. జ్ఞానేశ్వర్ 21 సంవత్సరముల 6 నెలలు ఈ భూమి మీద ఉన్నాడు. 15వ సంవత్సరంలో భగవద్గీతకు వ్యాఖ్యానం వ్రాసాడు. చాలామంది ఆచార్యులు భగవద్గీతకు వ్యాఖ్యానం వ్రాసారు, వారు సాంప్రదాయబద్ధంగా వ్రాసారు. కాని జ్ఞానేశ్వర్ ఆయన హృదయాన్ని ఓపెన్ చేసి అక్కడ పెట్టాడు. ఆయనకు మామూలుగా మరణం రాలేదు, ఆయన జీవ సమాధి పొందారు. మహారాష్ట్రలో ఆయనను జ్ఞానదేవుడు అని పిలుస్తారు. ఆయన కామక్రోధాల గురించి వ్రాస్తూ మీరు హిమాలయపర్వతాలకు వెళ్లి తపస్సులు చేస్తే కామక్రోధాలు పోతాయని గ్యారంటీ లేదు. పదిరోజులు అన్నంమానేస్తే కామక్రోధాలు పోతాయి అని అనుకోవద్దు. అప్పడు కామక్రోధాలు అణిగి ఉంటాయి. మరల అన్నం తినటం ప్రారంభిస్తే కామక్రోధాలు తిరిగి విజృంభిస్తాయి. మరి ఈ శరీరం చనిపోయాక కామక్రోధాలు పోతాయా అంటే అప్పడు అసలు పోవు అని చెప్పాడు. మరి కామక్రోధాలు ఎలా పోతాయి. నీకు సుఖపడాలని కాంక్ష ఉందా అని ఆయన ఒక భక్తుడిని అడిగాడు. ఉందండి అని చెప్పాడు. మేము సుఖంగా ఉండాలి, మా కుటుంబం సుఖంగా ఉండాలి అని అందరికీ అదే గొడవ కదా. మనం ఏ పని చేసినా సుఖాల కోసమే కదా, డబ్బు ఎందుకు సంపాదిస్తున్నాము, సుఖం కోసం సంపాదిస్తున్నాము. పెళ్లిళ్ళు ఎందుకు చేసుకొంటున్నారు, సుఖం కోసమే కదా. ప్రారబ్ధాన్ని బట్టి మీకు ఏదైనా దుఃఖం వచ్చినా, మాకు దుఃఖం రాకూడదు, మేము

సుఖంగా ఉండాలని అనుకొంటున్నారు కదా. నేను సుఖపడాలని ఇలా నువ్వు అనుకొన్నంత కాలం వెయ్యి జన్మలు ఎత్తినా, హిమాలయపర్వతాలకు వెళ్ళి వెయ్యి సంవత్సరాలు తపస్సు చేసినా నీకు కామక్రోధాలు పోవు అని చెప్పాడు. ఇంత గొప్పగా చెప్పినవాడు ఎవడూ నాకు కనబడలేదు. నీ లోపల హృదయం యొక్క లోయలలో నేను సుఖపడాలి అనే కోరిక నీకు ఉన్నంతకాలం నువ్వు కామక్రోధాలను జయించలేవు, ఇక్కడ కీలకం చెప్పాడు. మీరు స్త్రీలా, పురుషులా అనికాదు, అసలు మనిషికి సుఖపడాలని ఉంది కదా ఇంక నీకు కామక్రోధాలు ఎలా పోతాయి, ఇంకపోవు అని చెప్పాడు.

సుఖపడాలనే కోరిక ఎవడికైతే పోయిందో వాడికి నేచురల్ డెత్ వస్తుంది. కొంతమందికి రోగం ఏమీ ఉండదు, శరీరం ముసలిది అయి చనిపోతారు. శరీరం వయస్సును బట్టి ఎలాగ పోతోందో అలాగే సుఖపడాలనే కోరిక ఎవడికైతే లేదో వాడికి కామక్రోధాలు పోతాయి అని చెప్పాడు. నువ్వు ఎన్ని తపస్సులు చేసినా సుఖపడాలనే కోరిక నీలో ఉన్నప్పుడు మరల మాయ వచ్చేస్తుంది. ఆ కోరిక తీసుకొని వచ్చి నిన్ను మాయలో పడేస్తుంది అని చెప్పాడు. ఈ తపస్సుల వలన, యాగాలవలన ఏమీ ప్రయోజనం లేదు, చెప్పకోవటానికి పనికి వస్తాయి అన్నాడు. నీకు సుఖపడాలనే కోరిక ఉన్నంతకాలం కోటి జన్మలు ఎత్తినా కామక్రోధాలలోనుండి బయటకు రాలేవు. ఇంకో రహస్యం చెప్పాడు. నీకు సుఖపడాలనే కోరిక లేదు అనుకో నీకు దుఃఖం వచ్చినా, సుఖం వచ్చినా దాని స్పృహ నీకు ఉండదు అని చెప్పాడు. అంటే దుఃఖం వచ్చినప్పుడు నేను దుఃఖపడుతున్నాను ఏమిటి అని నీకు అనిపించదు, సుఖం వచ్చినప్పుడు నేను సుఖపడుతున్నాను అని అనిపించదు, అంటే ఆ స్పృహ నీకు ఉండదు, ఇది గొప్ప కీలకం. 15 సంవత్సరాల పిల్లవాడు ఎంత అందంగా చెప్పాడో చూడండి. ధ్యానం చేయండి, జపం చేయండి అని చాలా మంది చెపుతారు. లోపల కోరిక ఉన్నప్పుడు ఎన్నాళ్ళు ధ్యానం చేస్తే అదిపోతుంది. ఆ కోరిక కాన్సర్ జబ్బులాంటిది, అది అలా వ్యాపిస్తూ ఉంటుంది కాని ఇంక తగ్గదు. పూర్వం ఋషులు తపస్సులు చేసి చేసి కామక్రోధాలకు లొంగిపోయినట్లుగా పురాణాలు చెపుతున్నాయికదా. జ్ఞానేశ్వర్ చెప్పింది కరెక్ట్. ఆయన తపస్సులు వద్దనటంలేదు. నేను సుఖపడాలనే కోరిక నీలో ఉన్నప్పుడు ఇదంతా సున్నా, అది మరల నిన్ను మాయలో పడేస్తుంది అది జ్ఞానేశ్వర్ చెప్పేది.

మీకు ఆరోగ్యం బాగుంది, జేబులో డబ్బులున్నాయి, క్షేత్రాలు తిరిగితే తిరిగిరండి కాలక్షేపం అవుతుంది, ఇంట్లో గొడవలు కొన్ని తగ్గుతాయి. కొంతమందికి ఇంట్లో గొడవలుంటే

తాత్కాలికంగా వైరాగ్యం వస్తుంది, ఆ వైరాగ్యం నిజంకాదు. మీ కోడలు ఏమైనా పేచీలు పెడుతోంది అనుకోండి కొన్నాళ్ళు దూరంగా వెళ్ళి వద్దామురాబాబూ అనుకొంటారు. ఇవన్నీ నిజంకాదు. నువ్వు వేరు, నేను వేరు అనే తలంపు మనకు ఉంది కదా. ఆ వేరుబుద్ధే మాయ. అది ఉన్నంతకాలం పేచీలు తీసుకొనివస్తుంది. ఆ భేదబుద్ధి పోతేగాని నీకు బ్రాహ్మీస్థితి కలుగదు. మనకు ఎప్పుడైనా వైరాగ్యం వస్తూ ఉంటుంది. మహర్షులకూ వైరాగ్యం ఉంటుంది. కాని మన వైరాగ్యానికి, వారి వైరాగ్యానికి తేడా ఉంది. మనకు ఈ ప్రపంచం అంతా నిజంకింద కనిపిస్తోంది. ఇక్కడ ఉన్న వ్యక్తులు, వస్తువులు, సంఘటనలు అన్నీ నిజం కింద కనిపిస్తున్నాయి. ఇక్కడ పరిస్థితులను బట్టి మనకు ఒకోసారి వైరాగ్యం వస్తుంది. అంటే పరిస్థితుల బట్టి మీకు వైరాగ్యం వచ్చింది కాని ఇదంతా మీకు నిజం కింద కనిపిస్తోంది. అబద్ధం మీకు నిజం కింద కనిపిస్తున్నంత కాలం మీకు వైరాగ్యం వచ్చినా అది నిలబడదు. అది ఏదో టైములో వస్తుంది, ఏదో టైములో పోతుంది. కాని జ్ఞానికి వచ్చిన వైరాగ్యం అలా పోదు. ఎందుచేతనంటే ఈ ప్రపంచంలో కనిపిస్తున్న ఏ మనిషి, ఏ వస్తువు, ఏదీ నిజం కాదు అని వాడికి అనుభవంలో ఉంటుంది కాబట్టి వాడి వైరాగ్యం పోదు. వాడికి అబద్ధం అబద్ధంగా కనిపిస్తుంది కాబట్టి వాడు మోహంలో పడే అవకాశం లేదు. మనం ఏదో శాస్త్రం చదివి ఇదంతా అబద్ధం అని నోటితో చెపుతాము కాని అది నూటికి నూరుపాళ్ళు నిజం అనే అనుభవం హృదయంలో ఉంటుంది. ఇంక మీకు వైరాగ్యం ఎక్కడ నిలబడుతుంది. మీరు పైకి ఏమీ చెప్పవద్దు. నేను సుఖపడాలి అనేకోరిక అసలు లోపల నీకు ఉందా, లేదా అది చూసుకో అంటున్నాడు జ్ఞానదేవుడు. ఆ కోరిక ఉన్నప్పుడు కామక్రోధములు ఎలా పోతాయి, ఎన్నడూ పోవు అని చెప్పాడు. జపాలు, ధ్యానాలు, సత్పురుషుల సహవాసం ఇవి ఏమీ చెయ్యవద్దు అని నేను చెప్పటం లేదు. వీటివలన నీకు ఆకోరిక పోలేదు అనుకో ఇంక నీ పని సున్న అంటున్నాడు.

దుర్వాసనలు, చెడ్డసంస్కారాలు, చెడ్డతలంపులు ఇవి అన్నీ మన మనస్సులో ఉన్నాయి. ఆ మనస్సే నేను అనే బుద్ధి నీకు పోలేదు. ఇంక నీకు శాంతి ఏమిటిరా పిచ్చివాడా అంటున్నాడు. నిన్ను ఎవరయినా పొగిడితే సంతోషిస్తావు, ఎవరయినా విమర్శిస్తే బాధపడతావు, కొంతమంది మేము అవమానం భరించలేము అని చెపుతారు, చిన్న మాట కూడా పడలేరు. కొంతమందిని మీరు చాలా అందంగా ఉన్నారు అంటే నిజంగా అందంగా ఉంటే వారికి సంతోషం వచ్చేస్తుంది. అంటే శరీరం పట్ల నేను అనే బుద్ధి ఉంది, మనస్సు పట్ల నేను అనే బుద్ధి ఉంది. నువ్వు ఏదైతే కాదో దానిపట్ల నీకు నేను అనే బుద్ధి ఉన్నప్పుడు మరి నీకు కామక్రోధములు

ఎలాపోతాయి. నీ హృదయం యొక్క లోయలలోనికి దిగి, హృదయంలో ఉన్న పొరలను కోసుకొని లోపల అట్టడుగుకు వెళ్ళితే అక్కడ నీకు సుఖపడాలనే కోరిక ఉంది అనుకో, ఇంక నీవు ఏ దేవుడిని పూజించినా కామక్రోధాలు పోవు. ఆ పూజలకు పుణ్యం రావచ్చు, పుణ్యం సుఖం రూపంలో ఖర్చు అయిపోతుంది. ఈ ఖర్చుఅయిపోయే గొడవలను పట్టుకొంటావా, ఎప్పడూ ఉండేది నీకు కావాలో చూసుకో. దేహం చనిపోయేటప్పడు దేహం పోతోంది అని మీరు అనుకోవటం లేదు, నేను చనిపోతున్నాను అనుకొంటున్నారు అంటే దేహమే మీరు అనుకొంటున్నారు. దేహము నేను అనే బుద్ధే అహంకారం. దేశంలో ప్రజలు అందరూ చనిపోయినా మీకు అక్కరలేదు కాని మీకుటుంబ సభ్యులు చనిపోతే మీరే చనిపోతున్నట్లు బాధపడతారు, అదే మమకారం. మీరు పైకి ఏమీ చెప్పవద్దు కాని ఇవి రెండూ మీ లోపల ఉన్నాయో లేదో మీకు తెలుస్తోంది కదా. మీ అబ్బాయికి జీతం పెరిగింది అనుకోండి, మా అబ్బాయికి జీతం పెరిగింది అని ఎంతో మందికి చెపుతారు, వాడు చివరకు మీకు అన్నం పెట్టడు. వాడికి పది రూపాయలు పెరిగితే అవి మీ జేబులో పడిపోతాయి అనుకొంటారేమిటి, ఇదంతా తింగరతనం. ఇదంతా మీ మమకారంలోనుండి వస్తోంది. మీకు అహంకారం, మమకారం ఉన్నాయో లేదో మీకే తెలుస్తోంది కదా లేకపోతే ఇతరులు ఎవరయినా ఏదైనా పుస్తకం చదివి చెప్పాలా అంటున్నాడు జ్ఞానేశ్వర్. అహంకారం, మమకారం మీలో ఉన్నప్పడు తిరిగి మేము పుడతామా, పుట్టమా అని ఎవరినీ అడగవద్దు, నూటికి నూరుపాళ్ళు పుట్టి తీరతారు అని చెప్పాడు అంటే మీకు పునర్జన్మ వచ్చి తీరుతుంది.

నేను సుఖపడాలి అనే కోరిక అది వేరుపురుగు. నువ్వు ఎండ్రిన్ కొడితే అది పోదు. ఆకులకు, రొబ్బలకు పట్టిన పురుగులు ఎండ్రిన్ కొడితే పోతాయి కాని వేరుకు పట్టిన పురుగు ఎండ్రిన్ కొడితే పోదు, దాని మూలంలో తవ్వితేనే గాని అది పోదు. మీకు ఎప్పడు ఆసక్తి ఉండకూడదు. పని చేస్తూఉండాలి, ఫలితంపట్ల ఆసక్తి ఉండకూడదు. పనిచేసి ఆ ఫలితం ఏదో రోజున వస్తుంది అని మీరు అనుకొంటే ఇంక అవుటయిపోతారు. మీ తలంపుతో సంబంధం లేకుండా ఫలితం వస్తే అది నిన్ను బంధించదు. నీ మనస్సులో ఉన్న దుర్వాసనలను, దురలవాట్లను, దుర్వాంఛలనన్నింటిని ఊడగొట్టి, దేహము పట్ల, మనస్సు పట్ల నేను అనే బుద్ధిని వదులుకొని ఎవడైతే ఈ భూమి మీద చరిస్తున్నాడో వాడు మాత్రమే మోక్షాన్ని పొందుతాడు. ఈ భూమి మీద తిరుగుతున్నప్పడే నీకు ఆ స్థితి రావాలి, శరీరం చనిపోయిన తరువాత కాదు, ఆ స్థితిని పొందిన వాడు తిరిగి మోహంలో పడడు. మరణం వచ్చి మీ శరీరం మీద పడిన రోజుకి అయినా పైన చెప్పిన స్థితిని మీరు పొందితే అప్పడయినా మీరు

మోక్షాన్ని పొందుతారు అంటే ఒడ్డుకు వచ్చేస్తారు.

జ్ఞానదేవుడు ఇంకో రహస్యం చెప్పాడు. మీ అబ్బాయి పెళ్లి అవ్వకముందు ఒకరకంగా ఉంటాడు, పెళ్లయిన తరువాత ఒక రకంగా ఉంటాడు. పెళ్లి అంటే ఏమిటి మీ అబ్బాయి ఒక స్త్రీ దేహాన్ని కొనుక్కొంటున్నాడు. మీ అబ్బాయికి సుఖం కావాలి. తల్లితండ్రులకంటే వాడి సుఖం వాడికి ముఖ్యం. వీడికి సుఖపడాలనే కోరిక ఉంది కదా, ఆ కోరిక ఈ అమ్మాయి నెరవేరుస్తుంది. ఆ ఎంజాయ్‌మెంట్‌లో వాడు నెమ్మదిగా తల్లిదండ్రులను మరిచిపోతాడు. ఇది జ్ఞానేశ్వర్ చెప్పిన గొప్ప రహస్యం. పెళ్లి అయ్యాక కొడుకు తల్లిదండ్రులను ఎందుకు మరిచిపోతున్నాడో రీజన్ చెపుతున్నాడు. మీ అబ్బాయికి ఎంజాయ్‌మెంట్ కావాలి, ఆ వచ్చిన శవం వీడికి గ్రేట్ ఎంజాయిమెంట్ ఇస్తుంది. మామూలు ఎంజాయ్‌మెంట్ మీరు ఇవ్వవచ్చు గాని గ్రేట్ ఎంజాయ్‌మెంట్ ఇవ్వలేరు. కాబట్టి నెమ్మదిగా మానసికంగా మీకు దూరం అవ్వటం మొదలు పెడతాడు అని చెప్పాడు. తల్లితండ్రులకు నేను చెప్పేదేమిటంటే చేతిలో ఉన్నది గబుక్కున వదిలేయకండి. తరువాత వాళ్ళు చూస్తారు, చూడరు. మీరు బతికి ఉన్నంతకాలం మీ చెయ్యి విడిచి పెట్టవద్దు. మీ అనంతరం ఉన్నదేదో వాళ్లే తింటారు. ధనం రావటం అనేది పోవటం అనేది కేవలం మీ తెలివితేటల మీద ఆధారపడి ఉండదు. ఈశ్వరుని దయ ఉంటే ఇల్లంతా ధనంతో నిండి పోతుంది, ఈశ్వరుని దయలేకపోతే మీరు కోరిక పెట్టుకొన్నా యిల్లు నిండదు సరికదా మీ పొట్ట వెళ్లటమే కష్టమవుతుంది. నీ మనస్సులో ఏ సంకల్పాలు అయితే వస్తున్నాయో ఆ సంకల్పాలను తుడిచి పెట్టు. వ్యర్థమైన కోరికలు, వ్యర్థమైన తలంపులు ఇవి అన్నీ మనస్సులో ఉంటాయి. ఇవి నీకు ఉపయోగపడవు, నీకుటుంబానికి ఉపయోగపడవు, సమాజానికి ఉపయోగపడవు, అందుచేత మనోవ్యాపారము తగ్గించుకో.

జ్ఞానికూడా మనలాగే అన్నం తింటాడు, స్నానం చేస్తాడు, ఇతరులను పలకరిస్తాడు, వాడికి మనస్సు ఉంటుంది. ఆ మనస్సులో చెడ్డ ఏమీ ఉండదు, అది సహజమనస్సు, అందులో భోగ ప్రవృత్తి ఉండదు. వాడికి కావలసిన సుఖం, శాంతి హృదయంలో నుండి సప్లయి అవుతూ ఉంటుంది. అజ్ఞాని మనస్సు సహజంగా ఉండదు. సహజంగా లేదు కాబట్టే బయటనుండి భోగాలు కోరుకొంటుంది. జ్ఞాని ఎప్పుడైనా మీమీద కోపం తెచ్చుకొన్నా అది అసూయమీదో, వైరంమీదో కాదు, నువ్వు బాగుపడాలనే అలా ప్రవర్తిస్తాడు. అది కూడా నేచురల్‌మైండే. లోపల అసూయపెట్టుకొని, లోపల చెడ్డ ఉద్దేశం పెట్టుకొని మనం కోపం తెచ్చుకొంటే, మనం ఇతరులను తిడితే అది అసహజమైన మనస్సు. అజ్ఞాని మనస్సు కృత్రిమంగా

ఉంటుంది. నీ మనస్సు కృత్రిమంగా ఉంటే దానిని జహాతి అంటే విడిచిపెట్టాలి, మామూలుగా విడిచిపెట్టటంకాదు ప్రజహాతి అంటే పూర్తిగా విడిచిపెట్టాలి, శేషం లేకుండా విడిచిపెట్టాలి. మోక్షం పొందటానికి అడ్డువచ్చే గుణాలు నీలో ఉంటే సాధన చేసి వాటిని పూర్తిగా విడిచిపెట్టు. ఆచార్యులవారు ఏమన్నారు అంటే మీరు తిన్న అన్నం అరిగితే తిరిగి మీకు ఆకలిపుడుతుంది. అలాగే మీరు ఏదైనా శాస్త్రం చదివినా, పెద్దలు చెప్పింది శ్రవణం చేసినా అది మీకు అర్ధమైతే ఆత్మజ్ఞానం సంపాదించాలి అనే బుద్ధి మీకు కలుగుతుంది కాని అది అర్ధంకాకపోతే ఆత్మజ్ఞానం సంపాదించాలనే బుద్ధి కలుగదు అని చెప్పారు.

విద్య యొక్క లక్ష్యం ఏమిటి అంటే విషయాలను సేకరించటంకాదు, ఏకాగ్రత సంపాదించాలి. ఏకాగ్రత లేకుండా నీకు ఆత్మజ్ఞానం కలుగదు. ఆత్మజ్ఞానానికి పెట్టుబడి బాహ్యమైన సంపదలు కాదు. నీకు ఏకాగ్రత ఉండాలి, పవిత్రత ఉండాలి. ఆత్మజ్ఞానానికి అడ్డువచ్చే గుణాలు నీ మనస్సులో ఉంటే వాటిని ఎండింపజేయి. జ్ఞానేశ్వర్ ఏమనిచెప్పాడు అంటే నదులు వెళ్ళి సముద్రంలో కలిసేవరకూ ఇది గోదావరి నది, ఇది కృష్ణానది, ఇది గంగానది అని అనుకుంటాము. అవి సముద్రంలో కలిసాక ఇంక గంగానది లేదు, కృష్ణానది లేదు అంతా సముద్రంపాలు అయిపోతుంది. అలాగే నీకు జ్ఞానం కలిగేవరకూ నేను ఎల్లమ్మను, నేను పుల్లమ్మను, నేను ధవంతురాలిని, నేను పేదవాడిని అని ఇలా ఏడుస్తూనే ఉంటావు, జ్ఞానం కలిగేవరకూ ఈ ఏడుపు తప్పదు. ఆత్మజ్ఞానం పొందితే ఇంక ఏ గొడవ లేదు, ఉన్నది ఒక్కటే, అప్పుడు ఎటుచూసినా శాంతే, ఎటు చూసినా ఆనందమే. మీరు ఏ విషయంలోను, ఎవరితోటి పోల్చుకోవద్దు. ఇతరులతో పోల్చుకోవటం వలననే మీకు దుఃఖం వస్తోంది. మీ కొలతలను బట్టి మీరు బట్టలు కుట్టించుకొంటారు గాని ఇతరులను బట్టి కొట్టించుకోరు. అలాగే మీ పరిస్థితులను బట్టి మీరు బతకండి అంతేగాని ఇతరులతో పోల్చుకోవద్దు. ఈ పెంట అంతా మనస్సులో ఉంది. పైగా ఆ మనస్సే నేను అనే బుద్ధి నీకు ఉంది, అదే పెద్ద ప్రమాదం. అందుచేత ఆ మనస్సును పోగొట్టుకోవాలని నీకు అనిపించదు. అది నేనే అనుకొన్నప్పుడు నువ్వు ఎలా పోగొట్టుకొంటావు.

నీకు ఆత్మజ్ఞానం కలిగితే ఆత్మలో నుండే సుఖం, శాంతి అందుతూ ఉంటాయి. ఆత్మ సుఖానికి మించిన సుఖం ఎక్కడా లేదు. బాహ్యవిషయాలలోగాని, ఇతర లోకాలలో గాని ఎక్కడా సుఖం లేదు. మీరు పురాణాలు చదివి ఆ లోకంలో ఇంతభోగం ఉంది, ఈ లోకంలో ఇంత భోగం ఉంది అని నీవు అనుకొంటున్నావు అంటే ఆ భోగాల మీద నీకు లోపల కోరిక

ఉంది కాబట్టి ఆ లోకాలకు వెళితే ఆ భోగాలు అనుభవించవచ్చు అని నీకు అనిపిస్తోంది. పురాణాలు చదివి ఆ భోగాల మీద నీ మనస్సు వాలుతూ ఉంటే నీకు వైరాగ్యం లేదు అని అర్థం. భోగాల వలన పాపాలు వస్తాయి, భోగాల వలన రోగాలు వస్తాయి. మన దేశంలోనే కాదు, ప్రపంచంలో ఎక్కడ పాపం ఉన్నా, ఎక్కడ దోషం ఉన్నా వీటి అన్నింటికి 90 కారణాలు లేవు, అన్నింటికి రెండే కారణాలు ఉన్నాయి, అవే కామక్రోధాలు అన్నాడు జ్ఞానదేవుడు. నీకు ఆకర్షణ వద్దు, వికర్షణ వద్దు అంటున్నాడు జ్ఞానదేవుడు. నీకు ఆకర్షణ లేదు అనుకో, వికర్షణ లేదు అనుకో అప్పుడు నీకు సమానబుద్ధి వచ్చేస్తుంది. నీకు సమానబుద్ధి వచ్చినప్పుడు నీ బుద్ధి కంట్రోలులో మనస్సు ఉంటుందిగాని అది బయటకు వెళ్లదు. నీ మనస్సు ఏ విషయాల మీదకు అయితే పరుగెడుతోందో ఆ విషయాలనుండి నీ మనస్సును వెనక్కి లాక్కో, అదే సాధన అని పరమాత్మ చెప్పాడు. కృష్ణభక్తుడు అయిన జ్ఞానదేవుడు ఏమి చెపుతున్నాడు అంటే నీకు ఆకర్షణ లేనప్పుడు, వికర్షణ లేనప్పుడు అసలు నీ మనస్సు బయటకే వెళ్లదు కదా. అది బయటకు వెళితే దానిని వెనక్కి లాక్కోవటం గొడవ ఉంటుంది. అది బయటకు వెళ్ళాలి అంటే దానికి ఎక్కడైనా ఆకర్షణ ఉండాలి, వికర్షణ ఉండాలి. అవి రెండూ లేనప్పుడు ఇంక అది ఎందుకు బయటకు వెళుతుంది. మీరు ఇక్కడ గుర్తించవలసిన విషయం ఏమిటి అంటే మీ మనస్సులో భోగప్రవృత్తి ఉంటే ఆ భోగప్రవృత్తిని సాధన చేసి నెమ్మదిగా బయటకు తోలేయండి. మనస్సును అసహజమైన విషయాలలోనికి వెళ్లనివ్వకండి, మనస్సును సహజంగా ఉంచండి.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 14-01-2011, చెరుకుమిల్లి)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

**త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రై గుణ్యో భవార్జున!**

**నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ (2-45)**

వేదం అంటే జ్ఞానం అని అర్థం. మనకి ఋగ్వేదం, యజుర్వేదం, అథర్వణవేదం, సామవేదం అని నాలుగు వేదాలు ఉన్నాయి. వేదంలో ఒక్క ఆత్మజ్ఞానం గురించేకాదు, భౌతిక జ్ఞానం గురించి కూడా చెప్పారు. వేదంలో ఉన్న మంత్రాలే పెళ్లి మంత్రాలు చదువుతారు, శరీరాన్ని విడిచిపెట్టి జీవుడు వెళ్లినప్పుడు అపరకర్మలు చేసినప్పుడు కూడా చదివే మంత్రాలు వేదంలో చెప్పారు అంతేకాకుండా ఇల్లు ఎలా కట్టుకోవాలి అనేటువంటి విషయాలు కూడా చెప్పారు. ఇలా వేదంలో చెప్పకుండా విడిచిపెట్టిన విషయం లేదు. వేదాలలో సత్వగుణం,

రజోగుణం, తమోగుణం గురించి చెప్పారు. ఏ గుణం యొక్క ప్రభావం ఎక్కువగా ఉన్నప్పుడు వాళ్ళ ప్రవర్తన ఎలా ఉంటుందో అది కూడా వేదంలో చెప్పారు. ఈ గుణాలన్నీ బంధించేవి అందుచేత నువ్వు ఆ గుణాలన్నీ దాటివెళ్ళిపో. భగవంతుడు ఈ మూడు గుణాలలో మాయపెట్టాడు. అందులో మంచిగుణం ఉండవచ్చు, చెడ్డగుణాలు ఉండవచ్చు. నువ్వు ఆ గుణాల గొడవలలోకి వెళ్ళకు. అవన్నీ మాయకు సంబంధించిన విషయాలు. అందులోంచి బయటకు వచ్చేయి, నువ్వు గుణాతీతుడవు అవ్వాలి. నువ్వు బ్రాహ్మీస్థితిని పొందాలి అని పరమాత్మ చెప్పాడు.

మన ప్రారబ్దాన్ని బట్టి మనకి దుఃఖం వస్తూ ఉంటుంది, సంతోషం వస్తూ ఉంటుంది నీకు సంతోషం వచ్చినప్పుడు పొంగిపోకు, ఏదైనా కష్టం వచ్చినప్పుడు కుంగిపోకు అలా నీ బ్రెయిన్‌ని ఎప్పటికప్పుడు బేలెన్స్ చేసుకుంటూ ఉండు. కారుకి డ్రైవరు ఎటువంటివాడో, మన శరీరానికి మన బుద్ధి డ్రైవరులాంటివాడు. డ్రైవరుని బట్టేకారు తోలడం జరుగుతుంది అలాగే మన బుద్ధిని బట్టే మన శరీరం నడుస్తూ ఉంటుంది. నువ్వు సంతోషం వచ్చినప్పుడు పొంగిపోకుండా, దుఃఖం వచ్చినప్పుడు కుంగిపోకుండా నువ్వు బేలెన్స్ చేసుకుంటూ ఉంటే నీ బుద్ధి పవిత్రమవుతుంది, నీ బుద్ధి ఏకాగ్రమవుతుంది. ఎడ్యుకేషన్ అంటే ప్రపంచములో ఉన్న విషయాలని సేకరించటంకాదు, ఎడ్యుకేషన్ అంటే నీ మనస్సుని పవిత్రం చెయ్యి, నీ మనస్సుని ఏకాగ్రం చెయ్యి అది అవసరం. నువ్వు పవిత్రుడవు అవ్వటం, నువ్వు ఏకాగ్రత సంపాదించటం ఇవి విద్యలో ముఖ్యమైన భాగాలు.

ధనాన్నిబట్టి, విద్యనిబట్టి, అధికారాన్నిబట్టి మనిషికి ఎంతోకొంత గర్వం ఉంటుంది. తాను కాని గొడవలతోటి వాడు తాదాత్మ్యం పొందుతాడు. చనిపోతే ధనానికి వాడికీ సంబంధం ఏముంది, ఏమీ సంబంధం లేదు. ఇలా కానివిషయాలతోటివాడు తాదాత్మ్యం పొంది అక్కడ నుంచి మళ్ళీ అహంకారం, గర్వం తెచ్చుకుంటాడు. నీకు డబ్బు ఉండవచ్చు కాని నువ్వు డబ్బు కాదు. ఇప్పుడు నీకు ఏదైనా అధికారం ఉండవచ్చు, కాని ఎప్పడూ నువ్వు అధికారంలో ఉండవు కాలప్రవాహంలో అవి వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే గొడవల్ని పట్టుకొని నువ్వు పతనం అవ్వకు. నిర్ద్వంద్వో:- నీ జీవితంలో ద్వంద్వాలు వస్తూ ఉంటాయి. నువ్వు తట్టుకోవటం నేర్చుకో. తట్టుకోవటం నేర్చుకుంటే నువ్వు పవిత్రుడవు అవుతావు, నిర్మలుడవు అవుతావు, నీ బుద్ధి నిశ్చలముగా ఉంటుంది. నువ్వు ద్వంద్వాలు తట్టుకుంటూ ఉంటే నీ మనస్సు నీకు విరోధంగా ఉండదు,

నీ మనస్సు నీకు మిత్రుడిగానే ఉంటుంది. నీ మనస్సు నీకు మిత్రుడిగా ఉంటే నీ మనస్సు నీకు సేవ చేస్తుంది. నీ మనస్సు నీకు శత్రువుగా ఉంటే నీకు అపకారం చేస్తుంది. బయట వాళ్ళు నీపట్ల ఎలా ఉన్నారు అని కాదు ముందు నీ మనస్సుని నువ్వు స్వాధీనం చేసుకో, అది నీకు అనుకూలంగా ఉండేటట్టు చేసుకో అంటున్నాడు పరమాత్మ. నిత్యసత్త్వస్థ :- సత్యమైనది నిత్యంగా ఉంటుందికాని, సత్యముకానిది ఏదీ నిత్యముగా ఉండదు. నీ హృదయములో ఒక సత్యం ఉంది. ఆ వస్తువు నీకు చాలా క్లోజుగా, నియర్‌గా, డియర్‌గా ఉంది. అంతేకాదు అది నీవే. కానీ నీ రాంగ్ థింకింగ్ వలన, రాంగ్ ఐడెంటిఫికేషన్‌వల్ల అది నీవు అన్న సంగతి నీకు తెలియటంలేదు. నువ్వు సుఖపడాలి అంటే నీ హృదయంలో ఉండటం నేర్చుకో అప్పుడు నీ శరీరము, నీ ఇంద్రియాలు, నీ మనస్సు, నీ బుద్ధి అన్నీ నీకు స్వాధీనములోకి వస్తాయి. అప్పుడు నువ్వు సుఖపడతావు. నీ ఇంద్రియముల స్వాధీనములో, నీ మనస్సు స్వాధీనములో నువ్వు ఉంటే సుఖపడవు. అందుచేత వాటిని కంట్రోలు చేయటం నేర్చుకోవాలి, కంట్రోలు ఇచ్చే హేపీనెస్ మనకు కంఫర్ట్ ఇవ్వదు. అదే భగవాన్ చెబుతారు నీ హృదయంలో ఒక సద్వస్తువు ఉంది, దానితోటి నీకు జతచేయటం చేతనైతే చేసుకో, దానితోటి నీకు ఎలా స్నేహం చెయ్యాలో తెలియదు అనుకో బయట సత్‌పురుషులతోటి సహవాసం చెయ్యటం నేర్చుకో వాళ్ళ వైబ్రేషన్స్ నీ మీద పనిచేస్తూ ఉంటాయి అప్పుడు సద్వస్తువును తెలుసుకోవాలనే కాంక్ష నీకు వస్తుంది అంటున్నారు భగవాన్.

మన జీవితాన్ని మూడు భాగాలు చేస్తే ఒక భాగం నిద్రకు ఖర్చు అయిపోతుంది. ఇంకో భాగం మన పొట్టని పోషించుకోవటానికి ఖర్చు అయిపోతుంది. ఇంక మిగిలిన భాగం మన చేతిలో ఉంది, దానిని సద్వినియోగం చేసుకో. ఆ మూడవవంతు భాగంలో తెలివితక్కువ పనులు మానేసి తెలివైన పనులు చేస్తూ, చెడ్డ పనులు మానేసి మంచి పనులు చేస్తూ మనం బాగుపడేవిధానం చూసుకోవాలి. సత్కర్మలు చేస్తూ, భగవంతుడిని ఆరాధిస్తూ, సద్బుద్ధిని, సహృదయాన్ని ప్రసాదించమని భగవంతుడిని ప్రార్థిస్తూ కాలాన్ని నువ్వు సద్వినియోగం చేసుకో. కాలం మనకోసం ఆగదు. ఉన్న కాలాన్ని ఎవడైతే సద్వినియోగం చేసుకుంటున్నాడో వాడిని వివేకవంతుడు అంటారు. తెలివైన వాడికి, తెలివితక్కువ వాడికి తేడా ఏమిటి అంటే తెలివితక్కువ వాడికి కూడా అవకాశం వస్తుంది కానీ ఆ అవకాశాన్ని వదిలేస్తాడు, తెలివైనవాడు ఏమి చేస్తాడు అంటే వాడికి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాడు. అర్జునా కాలాన్ని సద్వినియోగం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యి అన్నాడు

పరమాత్మ. నువ్వు అన్ని గుణాలకు అతీతంగా ఉండటం నేర్చుకో. నీకు పాత అలవాట్లను బట్టి ఆ గుణాలు వస్తూ ఉంటాయి. అలవాట్ల యొక్క వేగం తగ్గించుకోవటానికి ప్రయత్నం చెయ్యి.

గాయత్రీ మంత్రం అర్థం ఏమిటి అంటే నాకు సద్బుద్ధిని ప్రసాదించు, నాకు సహృదయాన్ని ప్రసాదించు. నువ్వు ఎలా ఎరుకలోకి వస్తావో అలా జీవించేవిధానం నాకు నేర్పు అని చెప్పారు. సద్బుద్ధిని ప్రసాదిస్తే అన్నీ మనచేతిలో ఉన్నట్టే. మన బుద్ధిని మనం బాగ చేసుకోవాలి. మన బుద్ధిని మనం బాగు చేసుకుంటే అది సత్యానికి వెళ్ళే దారి చూపిస్తుంది. మన మనస్సు, బుద్ధి పూర్తిగా అణిగిపోతే ఆ చైతన్యము నీకు అనుభవంలోనికి వస్తుంది కాని అది మన మైండుతోటి ఎంక్వయిరీ చేసేది కాదు. నీ మైండుకి అందటానికి నీ కంటే చిన్న వస్తువు ఏంకాదది. ముందు నీ మనస్సులో ఉన్న అలవాట్లు అన్నీ కాలిపోవాలి, దేహము నేను అనే బుద్ధి కూడా పోవాలి అప్పుడు లోపల ఉన్న చైతన్యం దానంతట అదే నీకు ఎరుకలోనికి వస్తుంది. అదే రీలైజేషన్ అంటే. జ్ఞానం అంటే ఏమిటి అని ఒకరు రామకృష్ణ పరమహంసగారిని అడిగారు. ఏదైతే నేను, నేను అని నువ్వు అనుకుంటున్నావో ఆ నేను, నేనుకాదని తెలుసుకోవటమే ఆత్మజ్ఞానం అన్నారు.

మనిషిలో ఉన్న బలహీనత ఏమిటో ఇక్కడ భగవంతుడు చెబుతున్నాడు. యోగం అంటే లేనిది సంపాదించటం. వచ్చింది పోకుండా సర్వవిధములా కాపలా కాసుకోవటం క్షేమం. ఈ రెండే ప్రతీమనిషి చేస్తాడు. ఎవడి యోగక్షేమాలు వాడు చూచుకుంటూ ఉంటాడు. నువ్వు సంపాదించటం, దాచుకోవటం మళ్ళీ ఉన్నది పోకుండా చూచుకోవటం అంటే 24 గంటలు అదే పనిలో ఉంటే నువ్వు సత్యాన్వేషణ ఎప్పుడు చేస్తావు. ఎవడైతే తన యోగక్షేమాలు వదిలేసాడో వాడి యోగక్షేమాలని భగవంతుడు చూసుకుంటాడు. కాని భగవంతుడు చూడడేమో అని నీకు భయం వేస్తుంది. అసలు భగవంతుడు ఉన్నాడనే నమ్మకం నీకు లేదు కదా. ఆయన ఉన్నాడనే నమ్మకం లేనప్పుడు నువ్వు భగవంతుడి మీద ఎలా ఆధారపడతావు. ఈ ప్రపంచాన్ని ఎవడైతే చూస్తున్నాడో వాడే నిన్ను కూడా చూస్తాడు. నీ యోగక్షేమాల గురించి నిరంతరం ఆలోచించుకుంటూ ఉంటే నీ మనస్సు బాహ్యాముఖానికి వచ్చేస్తుంది కాని అంతర్ముఖం అవ్వదు. 24 గంటలూ నీ యోగక్షేమాలు చూసుకుంటూ ఉంటే ఇంక నువ్వు ఆత్మవిచారణ ఎప్పుడు చేస్తావు, సత్యాన్వేషణ ఎప్పుడు చేస్తావు.

అంతఃకరణం అంటే లోపలఉన్న పనిముట్టు. ఆ పనిముట్టుని ఎప్పుడూ శుద్ధిగా

ఉంచుకోవాలి. నువ్వు శరీరాన్ని ఎలా శుద్ధిగా ఉంచుకుంటున్నావో అలాగే నీ బుద్ధిని కూడా శుద్ధిగా ఉంచుకోవాలి. నీ బుద్ధి శుద్ధిగా లేదు అనుకో నువ్వు జ్ఞాని అవ్వలేవు. కెరటం లేనప్పడు నీళ్ళు ఎంత నిర్మలంగా ఉంటాయో, ఎంత స్వచ్ఛముగా ఉంటాయో, అంత నిర్మలంగా, అంత స్వచ్ఛముగా నీ బుద్ధి ఉండాలి. అంత స్వచ్ఛముగా నీ బుద్ధి లేకపోతే నీ స్వరూపం నీకు తెలియదు. సుఖం అనేది, శాంతి అనేది నీ స్వరూపంలోనే ఉంది. నువ్వు పొందేది సుఖంకాదు, సంతోషాలు పొందుతున్నావు. ఈ రోజు నువ్వు సంతోషంగా ఉంటే ఈ సంతోషం అంతా పరిణామంలో దుఃఖం కింద మారిపోవచ్చు కాని నువ్వు జ్ఞానం సంపాదిస్తే నీ దుఃఖం అంతా సుఖంగా మారిపోతుంది. సుఖం అనేది నీ స్వరూపంలోనే ఉంది కాని బయట ప్రపంచంలో ఏ వస్తువులోను, ఏ పదార్థంలోను సుఖమనేది లేదు. నీ అంతఃకరణాన్ని శుద్ధి చేసుకుని ఆత్మ సంపదని సంపాదించుకో అర్జునా అన్నాడు పరమాత్మ.

నీకు ఎటుచూసినా సుఖమే, ఎటుచూచినా శాంతే, ఎటుచూచినా ఆనందమే కలుగుతూ ఉంటే వాటికోసం ఇంక నువ్వు బయట విషయాల మీద ఆధారపడటమెందుకు? పంచదార ఫ్యాక్టరీ ఉన్నవాడు చిల్లరకొట్టుదగ్గరకు పంచదారకోసం తిరగటం ఎందుకు? నీకు ఎటుచూచినా మంచినీళ్ళు అందుతూ ఉంటే నువ్వు మంచి నీళ్ళ కోసం నుయ్యి చుట్టూ, కుళాయిల చుట్టూ తిరగటం ఎందుకు. జ్ఞానికి సుఖం, శాంతి, ఆనందం వాడి స్వరూపంలోంచే సప్లై అవుతుంది. ఇంక జ్ఞాని తన సుఖంకోసం ఇంద్రియాల మీదగాని, మనస్సుమీదగాని, విషయాలమీదగాని ఆధారపడనక్కరలేదు. జ్ఞాని యొక్క వైభవం అటువంటిది. నీ శరీరాన్ని విడిచిపెట్టి నువ్వు బయటకు వెళ్ళినప్పడు పుణ్యపాపాలు మోసుకువెళ్ళకు. పుణ్యమూ సంకెళ్ళే, పాపము సంకెళ్ళే రెండూ బంధిస్తాయి. పాపము వలన చెడ్డ జన్మ రావచ్చు, పుణ్యం వలన మంచి జన్మరావచ్చు. జన్మ వస్తే శరీరం వస్తుంది. శరీరం వస్తే ఇంక మనకు అన్నీ కష్టాలు, బాధలే కదా. నిద్దట్లోంచి మెలకువ వచ్చిన తరువాత నిద్దట్లో వచ్చిన గొడవలన్నీ ఎలా అబద్ధమని తెలుస్తాయో అలాగ నువ్వు పుణ్యం చేసినా, పాపం చేసినా నీకు స్వరూప జ్ఞానం కలిగితే అవన్నీ అబద్ధాలు అని తెలుస్తాయి. అక్కడకి నీ కళ్ళు తెరువు, నువ్వు జ్ఞానం కోసం తపించాలి అంటే దాని గురించి నువ్వు శ్రవణం చెయ్యాలి, దాని గురించి చదవాలి, నువ్వు జ్ఞానం గురించి వినగా, వినగా దాని వైభవం నీకు తెలుస్తుంది, దానిని సంపాదించాలనే బుద్ధి నీకు కలుగుతుంది. దాని వైభవం నీకు తెలియకపోతే సంపాదించాలనే బుద్ధి నీకు కలుగదు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| మార్చి | 2 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం (శివరాత్రి) |
| మార్చి | 6 | పాలమూరు |
| మార్చి | 19 | చించినాడ, గీతామందిరం |
| మార్చి | 30 | పోడూరు |
| ఏప్రియల్ | 6 | గుమ్మలూరు |
| ఏప్రియల్ | 12 | కొమ్మర శ్రీరామనవమి |
| ఏప్రియల్ | 17 | ముమ్మిడివరం మధ్యాహ్నం 2 గం॥లకు శ్రీ ఉమాసూరేశ్వరస్వామివారి కళ్యాణం నిమిత్తం |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha



అర్తమూరు గ్రామంలో కర్రి వెంకట భాస్కరరెడ్డిగారి

కుటుంబ సభ్యులు సద్గురు శ్రీ నాన్నగార్కి తులాభారం చేసినారు

# ప్రకృతిపై ఆసక్తి పెంచుకొంటే - అశాంతి వస్తుంది

పాప పుణ్యాలు దేహం ధరిస్తేనే గాని అనుభవానికి రావు. అందుకనే దేవుడు మనకు దేహాన్ని ఇచ్చాడు. శరీరంపై తగని వ్యామోహాన్ని కలుగజేసి 'నేను' అని మనచేత భ్రమింపజేసేటట్లు చేస్తాడు. భగవంతుడు శరీరాన్ని ఇచ్చి శిక్షింపచేస్తాడు. పాపం చెయ్యరాదనే 'స్మృతి' మనకు ఎప్పుడూ ఉంటుంది. కాని వాసనలు ఉన్నంతకాలం పాపాచణ నుంచి తప్పించుకోలేము. కేవలం గురు అనుగ్రహంతోనే దాన్ని దాటగలము. ఆసక్తి మనకు అన్యవిషయాలపైనే ఉంటుంది. ఇతరులనే 'మనముగా' చేసి వేస్తే ఆశ కలగదు. అంతా మనమే మనకంటే ఇతరులు లేరు కాబట్టి. ఆసక్తి లేని కారణంగా ప్రయత్నము లేదు మరో ఉపాయం 'ఈ దేహాలు అన్నీ నశించేవే' అనే స్ఫురణ మదిలో ఉంటే ఆసక్తి లేదు అది లేకపోతే ప్రయత్నము లేదు కాబట్టి పాపం లేదు. దేహం రాకపోతే దుఃఖం లేకుండా పోతుంది. అందంగా ఉంటే దాని కొరకు అర్రులతో చూస్తాము. అసలు రెండవది ఉంటేనే ఆసక్తి. మన లక్ష్యం సత్యాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలి. మనకు నిత్యానిత్య వివేకం కావాలి. కోరికలను పెంపొందించే మహిమలు మనలను అజ్ఞానమనే మూఢ నమ్మకాల ఊబిలో దించేస్తుంది. గొప్ప గొప్ప మేధావులు గౌరవ ప్రతిష్టలో సుఖముందని భ్రమిస్తారు. చరిత్ర చూస్తే అటువంటివారే జైలు జీవితానికి గురి అయ్యారు. అవి అన్నీ అస్థిరాలు నాశనమయ్యేవి వాటిని ప్రేమిస్తే సుఖం ఎలా దొరుకుతుంది. అన్నీ కలిగి ఉన్నా వాటిమీద రక్తి కోల్పోవాలి. సాధన పేరుతో కొందరు గంగాతీరం, పుణ్యక్షేత్రాలకు పోయి వాటికి బానిసలు అవుతారు. సాధకుడు ధర్మ అర్థకామాల ఆవస్యకతలను విలువలను, పరిధిని, అవధిని, ప్రయోజనాన్ని గుర్తించి వాటి బంధనాల నుండి బయటపడాలి అప్పడే మోక్షశాంతి కలుగుతుంది. సాధకుడు కోరికలను శత్రువుగా భావించాలి. అవి మోహాన్ని పెంచుకోవటానికి కారణమౌతాయి. ఇలా సంసార చక్రంలోంచి బయటపడలేము. వైరాగ్యంతో శాంతంగా జీవించాలి. అసలు మనస్సే భ్రమకు జన్మస్థానం. దాన్ని గ్రహించి దానితో బేధించకుండా నియమించుకోవాలి అప్పడు సాధకుడు కాలాన్ని వృధా చేసుకోడు. మనం ప్రపంచ సుఖాలను అనుభవిస్తూ అదేకాలంలో పరమసత్యాన్ని గ్రహించలేము విషయసుఖాలు విషమని గ్రహించాలి. "ఏ రోజు జీవితం స్వప్నంగా తోస్తుందో వాడు ఏడిచేకారణం కనబడదు" అంటారు పెద్దలు. ముందు మన మనస్సును బాగుచేసుకొంటే శాంతి అదే వస్తుంది. శాంత చిత్తులే సత్యాన్ని దర్శిస్తారు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**